క్లుప్తంగా

రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం రాహు-కేతు పూజలు నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయంలోని రాహు-కేతులకు విశేష చరిత్ర ఉండడంతో రాహు-కేతు దోషాలు ఉన్నవారు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. దోషనివారణకు పూజాధికాలు జరిపించారు.

పోలీసుల పల్లెనిద్ర

పెదకూరపాడు: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి పిలుపు మేరకు పెదకూరపాడు మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. పెదకూరపాడు ఎస్‌ఐలు కృష్ణారావు, సత్యనారాయణ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణారావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా సహకరించాలని కోరారు.

మొక్కలకు సక్రమంగా నీటిని అందించాలి



సత్తెనపల్లి: స్థానిక ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్‌లో మొక్కలకు సక్రమంగా నీటిని అందించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు చెప్పారు. పట్టణంలోని డివైడర్‌లో మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఎండా కాలం కనుక నీటిని మొక్కలకు సక్రమంగా అందించాలని, మట్టిని మారుస్తూ మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, షఫీ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడు ఇరిగేషన్ కార్యాలయంలో చోరీ




పెదకూరపాడు: పెదకూరపాడులోని ఎస్‌ఎస్‌పీ కెనాల్ వద్ద ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలోని స్టోర్ రూంలో పాత ఇనుప సామగ్రి చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదకూరపాడు ఇరిగేషన్ ఏఈ చిరంజీవిరెడ్డి కథనం ప్రకారం.. కొంత కాలంగా ఇరిగేషన్ స్టోర్‌రూంలో ఉన్న సుమారు రూ.35 వేల విలువ చేసే పాత సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు వివరించారు. ఈ విషయమై పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని పోలీసు సిబ్బంది పరిశీలించారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ముప్పాళ్ళ: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ కోరారు. ఆ మేరకు మాదల గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి తగిన రీతిలో సమాధానం చెప్పేలా కార్మిక సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఏర్పాట్లు



సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డులోని కోదండ రామ సాయి ఆలయ ప్రాంగణంలో త్వరలో రాతి ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుంది. 41 అడుగుల రాతి ధ్వజస్తంభాన్ని స్థానిక ఒకటో వార్డుకు చెందిన శాత్రాజుపల్లి నిమ్మయ కుమారుడు మాణిక్యాలరావు మాచవరం మండలం జింకలపాలెంలో తయారు చేయించారు. ఆదివారం అక్కడికి వెళ్లి ధ్వజస్తంభానికి పూజలు చేసి సత్తెనపల్లికి తీసుకువస్తున్న సందర్భంగా ఒకటో వార్డు వాసులు మాణిక్యాలరావును అభినందించారు. ఆలయపూజారి ప్రేమ్ కుమార్, ఒకటవ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెళ్లకు వైఎస్సార్ సీపీ ఆసరా

- ఎమ్మెల్యే నంబూరుశంకరరావు
- అట్టహాసంగా వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పేద మహిళలకు అండగా నిలిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం ఏపీఎం సలీం అధ్యక్షతన ఆదివారం క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా మూడో విడతలో నియోజకవర్గంలో మొత్తం 4,032 మందికి రూ.31.13 కోట్ల లబ్ధి చేకూరినట్టు చెప్పారు. మొత్తం ఈ మూడేళ్లలో రూ.93.58 కోట్లు మహిళా గ్రూపు సభ్యులకు అందాయని పేర్కొన్నారు. అక్క చెల్లెళ్ల కోసం సీఎం జగనన్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. వారి రక్షణ కోసం దిశ యాప్‌ను ప్రవేశపెట్టారని వివరించారు. ఆడపడుచుల పేర్ల మీదే ఇళ్లస్థలాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు.

త్వరలోనే సీఎం పర్యటన

త్వరలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మల్లాచంద మామ, మార్కెట్ యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలా, ఏపీఎం సలీం, సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ గఫూర్, షేక్ మస్తాన్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుమల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, అడిగి ముస్తఫా, జూనియర్ వెంకట్రావు, గార్లపాటిదాసు, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పెదకూరపాడు నియోజకవర్గంలో మూడేళ్లలో వైఎస్సార్ ఆసరా లబ్ధి ఇలా..

మండలం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
అచ్చంపేట	976	19.42
అమరావతి	1,229	33.61
బెల్లంకొండ	236	3.08
క్రోసూరు	861	17.57
పెదకూరపాడు	730	19.90
మొత్తం	4,032	93.58

గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి



బహుమతి ప్రధానం చేస్తున్న డాక్టర్ శ్రీధర్, సదనం హరి, తదితరులు

సత్తెనపల్లి: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సంజనా వైద్యశాల వైద్యుడు జి.శ్రీధర్ చెప్పారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 20 రోజులుగా జరుగుతున్న బాబి మెమోరియల్ క్రికెట్ లీగ్ సీజన్-3 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలలో ప్రథమ స్థానం వేద అనన్య నరసరావుపేట, ద్వితీయ స్థానం దర్శి రైడర్స్ దర్శి, తృతీయ స్థానం హనుమాన్ సీసీ సత్తెనపల్లి క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో డాక్టర్ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 6వ వార్డు వైఎస్సార్ సీపీ నేత సదనం హరి మాట్లాడుతూ ఓటమి పాలైన క్రీడాకారులు కుంగి పోకుండా మరింత తర్ఫీదు పొంది రాణించాలన్నారు. గెలుపొందిన మూడు జట్లను అభినందించారు. అనంతరం విజేతలకు ప్రథమ స్థానానికి రూ. లక్ష నగదు, ట్రోఫీ, ద్వితీయ స్థానానికి రూ.60 వేలు నగదు, ట్రోఫీ, తృతీయ స్థానానికి రూ.40 వేలు నగదు, ట్రోఫీని అందించారు. టి.అరుణ, పొట్ల ఆంజనేయులు, నరిశెట్టి తాండవ కృష్ణ, పూజల వెంకట కోటయ్య, ఫణీంద్ర, హనుమాన్ క్రికెట్ క్లబ్ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

సత్యబ్లడ్ సెంటర్‌లో రక్తదానం

సత్తెనపల్లి: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని సత్యబ్లడ్ సెంటర్‌లో ఆదివారం రక్తదాన శిబిరం రామ్‌చరణ్ యువశక్తి టీమ్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ముందుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పల్నాడు రామ్‌చరణ్ యువశక్తి అధ్యక్షుడు సిరిగిరి నరేంద్ర, షేక్ ఖాజా, మోహన్, అనిల్ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్



గెలుపొందిన న్యాయవాదులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్
- క్రికెట్ టోర్నమెంట్‌లో న్యాయవాదుల జట్టు ఘన విజయం

సత్తెనపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ చెప్పారు. పట్టణంలోని శరభయ్యగుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం న్యాయవాదులు, పోలీసులకు మధ్య నిర్వహించిన స్నేహ పూర్వక క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయమూర్తి మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. సత్తెనపల్లిటౌన్ సీఐ యు.శోభన్ బాబు, పెదకూరపాడు సీఐ కె.వీరాస్వామి, పట్టణ ఎస్‌ఐ రఘుపతి, అచ్చంపేట ఎస్‌ఐ కె.పాల్‌రవీందర్ మాట్లాడారు. ముందుగా జడ్జి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న న్యాయవాదుల జట్టు 15 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పోలీస్ జట్టు 15 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి 11 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. న్యాయవాదుల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన న్యాయవాది అంచుల రామాంజనేయులు 26 బంతుల్లో 41 పరుగులు చేసి అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. మరో న్యాయవాది రమేష్ 30 పరుగులు చేశారు. పోలీస్ జట్టులో అచ్చంపేట ఎస్‌ఐ కె.పాల్ రవీందర్ 35 పరుగులు చేశారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారురి లింగారెడ్డి, ఏపీపీ బగ్గి నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు చిన్నం మణి బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, దివ్వెల శ్రీనివాసరావు, పూజల వెంకట కోటయ్య, గంగూరి అజయ్, పీపీఎస్. నరసింహశాస్త్రి, కొమ్మిశెట్టి సాంబశివరావు, కొల్లా వెంకటేశ్వరరావు, బీఎల్ చిన్నయ్య, ఎం.ఏడుకొండలు, బొక్కా సంగీతరావు, నరిశేటి వేణుగోపాల్, శెట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నంబూరుపై ఆరోపణలు అవాస్తవం



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు తదితరులు

అమరావతి: వైఎస్సార్ సీపీపైనా, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపైనా దండా నాగేంద్ర చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీపీ మేకల హనుమంతరావుయాదవ్ చెప్పారు. ఆదివారం హనుమంతరావు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తన అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహించలేదనే అక్కసుతోనే ఎమ్మెల్యే శంకరరావుపైన, శంకరరావు కుటుంబ సభ్యులపైన నాగేంద్ర అవాస్తవ ఆరోపణలతో బురద జల్లుతున్నారని విమర్శించారు. గతంలో ఎమ్మెల్యే ఆదేశించారని పార్టీ నేతలకు అబద్ధాలు చెప్పి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఇసుకపై నాగేంద్ర కేసు వేశాడని, ఆ తర్వాత ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే నాగేంద్రను పిలిపించి కేసు ఉపసంహరించుకోవాలని మందలించారని, దీనికి తాను ప్రత్యక్ష సాక్షినని హనుమంతరావు వివరించారు. గతంలో జేపీ కంపెనీ ప్రతినిధులు ఇసుక అమ్మకాల్లో నిబంధనలు పాటించకపోవడంతో ఎమ్మెల్యే వారిని పిలిచి ఇసుకను ప్రజలకు నిబంధనల మేరకు అందించాలని హెచ్చరించారని, ఆ వీడియోను ఇప్పుడు ప్రదర్శించి స్వార్థ ప్రయోజనాలకు నాగేంద్ర వాడుకోవడం నీచమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై నాగేంద్ర అవాకులు, చెవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ ప్రజాదరణ పొందిన ఎమ్మెల్యే శంకరరావు నిజాయితీ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాడపర్తి పుల్లయ్య, పోరెడ్డి శివారెడ్డి, నల్లిబోయిన బసవయ్య, తట్టికోళ్ళసాయి, నల్లగోర్ల శ్రీనివాస్, పెద్దిబోయిన శ్రీనివాస్, తన్నీరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో దళితులకు అగ్రతాంబూలం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



బాబూరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే దళితులకు సరైన న్యాయం జరుగుతోందని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడులోని అంబేడ్కర్ బొమ్మ వద్ద వైఎస్సార్ సీపీ దళిత సంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెండెం బాబురావు అభినందన సభ ఆదివారం రాత్రి నిర్వహించారు. సభకు పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ బాబురావు రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన బుడగజంగాల ప్రతినిధులు

బేడ బుగడ జంగాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావును బేడ బుడగజంగాల రాష్ట్ర నేతలు రాములు, లత సత్కరించారు. అనంతరం పెండెం బాబురావును శంకరరావు సత్కరించారు. కార్యక్రమంలో జైభీమ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి బాలయ్య, క్రోసూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్ చైర్మన్ గార్లపాటి దాసు, మండల పార్టీ కన్వీనర్లు షరీఫ్, చంద్రయ్య, క్రోసూరు సత్తెనపల్లి ఎంపీటీలు కోటయ్య, శివాజీ, హనుమంతురావు, అనిల్‌కుమార్, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ రూపశిల్పి దివ్వెలకు సత్కారం



దివ్వెలను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: స్థానిక గీతామందిరంలో ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగురి శరత్ బాబు ఆధ్వర్యంలో దాతల దాతృత్వంతో 500 రోజులు భరతమాత అన్నప్రసాద వితరణ పథకం దిగ్విజయంగా పూర్తి చేసిన సందర్భంగా ఆ కార్యక్రమ రూపశిల్పి, ఆర్యవైశ్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి, ఆర్యవైశ్య అఫీషియల్స్ సంఘం పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావును ఆదివారం సన్మానించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘంతో పాటు పలు ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు, ప్రముఖుల సమక్షంలో భారీ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సీనియర్ న్యాయవాది అయినా తనే స్వయంగా భోజన ప్యాకెట్లను మోసుకొని తెచ్చి సేవ చేసిన మహోన్నత వ్యక్తి దివ్వెల అని ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య కొనియాడారు. వెలుగురి శరత్‌బాబు సేవలనూ కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు సింగరి మధుసూదనరావు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, సత్తెనపల్లి గోశాల అధ్యక్షుడు మాడా నాగ రమేష్, ఆర్యవైశ్య సేవా సమితి గౌరవ అధ్యక్షుడు జమిలి రాధాకృష్ణమూర్తి, కోశాధికారి మద్ది వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు కనమర్లపూడి సుబ్బారావు, కొత్త లక్ష్మయ్య, కూరపాటి విజయ శంకర్, పులిపాటి శ్రీరామమూర్తి, నోముల రమణ, దేవరపల్లి కాశీ, పొత్తూరి దుర్గారావు, మద్ది సతీష్, జవ్వాజి సత్యనారాయణ, శివాపురం వెంకట రామారావు, పెండ్యాల కాశీ మల్లేశ్వర రావు, చందులూరి నరసింహరావు, రెడ్డి శ్రీనివాసరావు, నెరేళ్ళ మోహన్, సముద్రాల నరసింహరావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్‌లో ఎస్టీయూ(డీ) నేతల చేరిక

సత్తెనపల్లి: పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ సత్తెనపల్లి జోన్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.సాయి లక్ష్మి అధ్యక్షతన 'ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యలు –మన కర్తవ్యాలు' అనే అంశంపై ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్టీయూ(డీ) నాయకులు కార్యకర్తలు ఏపీటీఎఫ్‌లో చేరారు. ఎస్టీయూ(డీ) మాజీ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్ బాబుతోపాటు సత్తెనపల్లి, క్రోసూరు, అచ్చంపేట మండలాలకు చెందిన 27 మంది క్రియాశీల కార్యకర్తలు ఏపీటీఎఫ్‌లో చేరారు. అంతేకాకుండా టీఎన్‌యూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, పీఆర్టీయూ నుంచి కొయ్యలమూడి సుధాకర్ ఏపీటీఎఫ్‌లో చేరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల వీరికి సభ్యత్వం ఇచ్చి సంఘంలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన విద్యా సదస్సులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బానుమూర్తి విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలు, మన కర్తవ్యాలు అనే అంశంపై మాట్లాడారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, సంపాదకవర్గ సభ్యులు వై.నేతాంజనేయ ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా, పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాస రావు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్, పల్నాడు జిల్లా సబ్ కమిటీ సభ్యులు డి.శ్రీనివాసరావు, కరీముల్లా, లక్ష్మణ కుమార్, శివానంద్, జోసెఫ్ కిరణ్ కుమార్, సాని శ్రీనివాసరావు, దాసు, ఇబ్రహీం, ధర్మారావు, అమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఎమ్మెల్యే పరామర్శ



వైఎస్సార్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: అచ్చంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ కన్నసం గుంటూరులో బైపాస్ సర్జరీ చేయించుకోగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అలాగే చెరుకుంపాలెం గ్రామానికి చెందిన సుంకర పెద్ద పోతురాజు, చిన్నపోతురాజు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరులో చికిత్స పొందుతుండగా వారిని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అచ్చంపేట కన్వీనర్ షేక్ సైదావలి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నయల్లమందయ్య, గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు సత్కారం

సత్తెనపల్లి: విశిష్ట వ్యక్తులను సన్మానించడం చాలా తృప్తిని, సంతోషాన్ని ఇస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షులు తవిటి భావన్నారాయణ చెప్పారు. ఇటీవల ఉగాది పురస్కారాలు అందుకున్న పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త మంచికంటి వెంకటేశ్వరరావు, ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావును ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ కంబాల వెంకటేశ్వరరావు, లయన్ వై.పి.మురళీకృష్ణ మాట్లాడుతూ సన్మానగ్రహీతలిద్దరూ సత్తెనపల్లికి చెందినవారు కావడం, అందులోనూ మంచికంటి తమ క్లబ్ సభ్యుడు కావడం గర్వకారణమని ప్రశంసించారు. అనంతరం ఇద్దరినీ సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ వల్లూరి శ్రీనివాసరావు, లయన్ పెద్దింటి చంద్రయ్య, లయన్ డాక్టర్ కృష్ణమా చార్యులు, లయన్ డాక్టర్ సాధు నరసింహారావు, లయన్ పెద్దింటి వెంకటేశ్వర్లు, లయన్ పెరుమాళ్ళ శ్రీనివాసరావు, లయన్ కొప్పురావురి గురుప్రసాద్, లయన్ తిరుమల సాంబశివరావు, లయన్ వీరాంజ నేయులు, లయన్ మహేశ్వర రావు, పెన్షనర్స్ అసోసి యేషన్ ఉపాధ్యక్షుడు అంకాళ్ళ ప్రభుదాస్, నాటకరంగ నంది అవార్డు గ్రహీత లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేద్దాం

అమరావతి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాల్లోని బోరుపంపులను మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తాగునీటి పథకాలలో ఉన్న మోటార్లు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. తాగునీటి నమూనాల పరీక్షకు కావాల్సిన యంత్ర సామగ్రిని సరిగా వినియోగించడం లేదని తమ దృష్టికివచ్చిందని, తాగునీటిని తప్పకుండా పరీక్ష చేయాలని ఆదేశించారు. పశుపోషకులు 1962 నంబరుకు ఫోన్ చేస్తే చాలు సంచార వాహనంలో పశువైద్యసిబ్బంది వచ్చి జీవాలకు చికిత్స అందిస్తారని వివరించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో మండల పరిషత్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం మండల స్థాయి అధికారులు శాఖాపరమైన నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ మెంబరు షేక్ హుష్మీ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మంగిశెట్టి శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయశ్రీ ఎంపీడీఓ మాధురి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.